క్లుప్తంగా

విలీన గ్రామాలకు అధిక నిధులివ్వాలి

మహబూబాబాద్ రూరల్: మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని విలీన గ్రామాలకు అధిక నిధులు కేటాయించాలని కోరుతూ ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్‌కు విలీన గ్రామాల నాయకులు శంతన్ రామరాజు, భూక్య రవికుమార్, న్యాయవాది షేక్ పాషా మంగళవారం వినతిపత్రం అందజేశారు. స్పందించిన ఎమ్మెల్యే అసెంబ్లీ సమావేశాల అనంతరం విలీన గ్రామాల్లో ఉన్న సమస్యలపై దృష్టిపెట్టి ఓ ప్రత్యేక ప్రణాళిక ద్వారా అభివృద్ధిపరుస్తామని హామీ ఇచ్చారన్నారు. కార్యక్రమంలో గుగులోత్ నేతాజీ, గుగులోత్ రాములునాయక్ పాల్గొన్నారు.

అంకెల గారడీ బడ్జెట్

నెహ్రూసెంటర్: లోకసభలో ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్ అంకెల గారడీలా, దేశ ప్రజలను మభ్యపెట్టేలా ఉందని సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ జిల్లా సహాయ కార్యదర్శి కొత్తపల్లి రవి, సీపీఐ జిల్లా కార్యదర్శి బి.విజయసారథిరెడ్డి మంగళవారం వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. మూడోసారి అధికారంలోకి వచ్చిన మోదీ సర్కార్ ప్రాధాన్యత రంగాలను విస్మరించిందన్నారు. తెలంగాణకు మొండిచేయి చూపారని ఆందోళన వ్యక్తం చేశారు.

అప్రమత్తంగా ఉండాలి



కురవి: ప్రజలు విద్యుత్ ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలని విద్యుత్ శాఖ డీఈ సునీత అన్నారు. మంగళవారం మండలంలోని నేరడ శివారు బాల్య తండాలో విద్యుత్ ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వర్షాకాలంలో తెగిపడిన తీగలను తాకవద్దని, గమనించిన వెంటనే సమీపంలోని విద్యుత్ కార్యాలయానికి ఫోన్ చేయాలని సూచించారు. ట్రాన్స్‌ఫార్మర్లపై ఫ్యూజులు, సర్వీస్ వైర్లు వీధి దీపాలు మార్చుట మొదలైన పనులు ప్రైవేట్ వ్యక్తులు చేయవద్దన్నారు.

జయప్రదం చేయాలి

తొర్రూరు: జిల్లా సమగ్ర అభివృద్ధి కోసం ఈనెల 31న జిల్లా కేంద్రంలో చేపట్టిన చలో కలెక్టరేట్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సీపీఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ సభ్యుడు తమ్మెర విశ్వేశ్వరరావు పిలుపునిచ్చారు. సీపీఐ పిలుపు మేరకు జిల్లా సమితి ఆధ్వర్యంలో మంగళవారం డివిజన్ కేంద్రంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు మహేందర్, కిరణ్, లక్ష్మణ్, వెంకన్న పాల్గొన్నారు.

చెక్కు అందజేత



మహబూబాబాద్ రూరల్: తల్లిదండ్రులను కోల్పోయిన కురవి మండల కేంద్రానికి చెందిన మానసకు టీయూడబ్ల్యూజే (ఐజేయూ) జిల్లా అధ్యక్షుడు సీహెచ్.శ్రీనివాస్ పర్యవేక్షణలో దాతల నుంచి సేకరించిన రూ.1.37 లక్షల ఫిక్స్‌డ్ డిపాజిట్ చెక్కును ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్, టీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు విరాహత్ అలీ అందజేశారు. కార్యక్రమంలో సీడబ్ల్యూసీ చైర్ పర్సన్ డాక్టర్ ఎస్.నాగవాణి, అడ్డగోడ రాజేష్, శంకర్ గౌడ్ పాల్గొన్నారు.

ముదిరాజ్‌లను బీసీ 'ఏ'లోకి మార్చాలి

బయ్యారం: బీసీ 'డీ'లో ఉన్న ముదిరాజ్‌లను బీసీ 'ఏ'లోకి మార్చాలని మంగళవారం తెలంగాణ ముదిరాజ్ మహాసభ ఆధ్వర్యంలో నాయబ్ తహసీల్దార్‌కు వినతిపత్రంను అందజేశారు. ఈ సందర్భంగా మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీనివాస్ మాట్లాడారు. కార్యక్రమంలో సహదేవ్, రాజు, రాంభద్రం పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు అందించాలి



మహబూబాబాద్: తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న నాయకులు



గార్ల: ధర్నా చేస్తున్న సీపీఐ నాయకులు



కురవి: తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న సీపీఐ నాయకులు

మహబూబాబాద్: పేదలకు ఇంటి పట్టాలు, ఇంటి నంబర్లు, రేషన్ కార్డులు, పింఛన్లు ఇవ్వాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి బి.అజయ్‌సారథి రెడ్డి డిమాండ్ చేశారు. సీపీఐ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో పెరుగు కుమార్, చింతకుంట్ల వెంకన్న, రేషపల్లి నవీన్, శ్రావణ్, ప్రవీణ్, వెంకన్న, ఫాతిమా, రవీందర్, చిరంజీవి, శంకర్ పాల్గొన్నారు.

గార్ల: అర్హులందరికీ కొత్త రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ సీపీఐ ఆధ్వర్యంలో మంగళవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర నాయకుడు శ్రీనివాసరావు, వెంకన్న, నర్సింహరావు, భీముడు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలి

కురవి: అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు, పింఛన్లు మంజూరు చేయాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి నల్లు సుధాకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు పోగుల శ్రీనివాస్‌గౌడ్, కరణం రాజన్న, బుర్ర సమ్మయ్య, తరుక రమేష, వెంకన్న, దూదికట్ల సారయ్య, వీరన్న, కృష్ణ, పద్మావతి, జానకి, మల్లయ్య, రాధా పాల్గొన్నారు.

ప్రజాసమస్యలను పరిష్కరించాలి

కేసముద్రం: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని సీపీఐ మండల కార్యదర్శి చొప్పరి శేఖర్, మండల సహాయ కార్యదర్శి మంద భాస్కర్ డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలోని అంబేడ్కర్ సెంటర్‌లో పార్టీ ఆధ్వర్యంలో ధర్నా చేశారు. కార్యక్రమంలో ఉపేందర్, లింగస్వామి, లక్ష్మీనర్సయ్య, వీరస్వామి పాల్గొన్నారు.

మరిపెడ: అర్హులైన ప్రతి ఒక్కరికి రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలందించాలని సీపీఐ మండల కార్యదర్శి మారగాని బాలకృష్ణ డిమాండ్ చేశారు. మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో వినతపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఐ మండల సహాయ కార్యదర్శి ఎండి అబ్దుల్ రషీద్, యాకన్న, అంజి, దయాకర్, నారాయణ పాల్గొన్నారు.

వ్యాధుల నివారణ అందరి బాధ్యత



మహబూబాబాద్ రూరల్: సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ అలివేలు

మహబూబాబాద్ రూరల్: సీజనల్ వ్యాధుల నివారణ విషయంలో ప్రతీ ఒక్కరు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని మండల ప్రత్యేక అధికారి (ఆర్డీఓ) అలివేలు అన్నారు. సీజనల్ వ్యాధుల నివారణపై మహబూబాబాద్ మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో వైద్యారోగ్య, పంచాయతీ రాజ్ శాఖల సిబ్బందికి మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. వర్షాకాలం సీజన్‌లో ప్రజలు అనారోగ్యం బారినపడకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వర్షాకాలం నేపథ్యంలో గ్రామస్థాయిలో ప్రణాళిక ప్రకారం అధికారులు అప్రమత్తంగా పనిచేయాలని పేర్కొన్నారు. ఈ సదస్సులో ఇన్‌చార్జ్ జెడ్పీ సీఈఓ నర్మద, తహసీల్దార్ భగవాన్ రెడ్డి, ఎంపీడీఓ రవికుమార్, ఎంపీఓ హరిప్రసాద్ పాల్గొన్నారు.

పరిశుభ్రత పాటించాలి

డోర్నకల్: గ్రామాల్లో ప్రజలు వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలని ఎంపీడీఓ శ్రీనివాస నాయక్ కోరారు. మండలంలోని కొత్తదుబ్బతండా గ్రామపంచాయతీ పరిధిలోని చింతల్‌తండాలోని వీధుల్లో చేపట్టిన శానిటేషన్ పనులను మంగళవారం ఎంపీడీఓ పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీఓ మున్వర్‌బేగ్, హెల్త్ సూపర్‌వైజర్ వెంకటరమణ, పంచాయతీ కార్యదర్శి లోకేష్ పాల్గొన్నారు.

పరిశుభ్రత సామాజిక బాధ్యత

పెద్దవంగర: పరిసరాల పరిశుభ్రత సామాజిక బాధ్యతగా భావించాలని ఎంపీడీఓ వేణుమాధవ్ అన్నారు. మంగళవారం మండలంలోని వడ్డెకొత్తపల్లి గ్రామంలో డ్రైడే కార్యక్రమం నిర్వహించారు. జీపీ కార్యదర్శి పరమేశ్‌తో కలిసి గ్రామంలో పర్యటించారు.

సీజనల్ వ్యాధులను అరికట్టాలి

కేసముద్రం: సీజనల్ వ్యాధులు సక్రమించకుండా అధికారులంతా కలిసి కట్టుగా పనిచేయాలని ఎంపీడీఓ రవికుమార్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో సీజనల్ వ్యాధుల నివారణపై అధికారులతో కోఆర్డినేషన్ మీటింగ్ నిర్వహించారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ నంబీకిషోర్, సురేష్, డిటీ రాములు, ఎంపీఓ రఘుపతిరెడ్డి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ విజయ పాల్గొన్నారు.

రైతు ఉత్పత్తి కేంద్రాలతో లాభదాయకం



రైతులతో మాట్లాడుతున్న ఏజీఎం చంద్రశేఖర్

మరిపెడ రూరల్: రైతు ఉత్పత్తి కేంద్రాలతో రైతులకు ఎంతో లాభదాయకంగా ఉంటుందని నాబార్డు ఏజీఎం చంద్రశేఖర్ అన్నారు. మరిపెడ మండలం లచ్చతండా గ్రామ పంచాయతీ పరిధిలో రైతు ఉత్పత్తిదారుల కమిటీ లిమిటెడ్(ఎఫ్‌పీఓ) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఎరువులు, పురుగు మందులు, విత్తనాల షాపును మంగళవారం మరిపెడ ఏఓ వీరసింగ్‌తో కలిసి ఏజీఎం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏజీఎం మాట్లాడుతూ.. లచ్చతండా రైతులు సంఘటితంగా ఏర్పడి ఎఫ్‌పీఓ ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో స్పందన సొసైటీ వ్యవస్థాపకుడు సోమయ్య, సీఈఓ నరేందర్, మేకల కృష్ణ, పాలకవర్గం సభ్యులు లక్ష్మణ్, పాపులాల్, రెడ్డి, తిరుపతి, దేవిదాస్, రామలక్ష్మి, రాముకుమార్, కీమా, జామ, రమేష్ పాల్గొన్నారు.

గురుకులం విద్యార్థిని అదృశ్యం

తల్లికి అప్పగించిన పోలీసులు

మహబూబాబాద్ అర్బన్: టీజీ ట్రైబల్ వెల్ఫేర్ గురుకుల పాఠశాల నుంచి విద్యార్థిని సోమవారం రాత్రి అదృశ్యం అయింది. వివరాలకు వెళ్తే జిల్లా కేంద్రంలోని యశోదగార్డెన్ భవనంలో ఉన్న టీజీ ట్రైబల్ వెల్ఫేర్ బాలికల గురుకుల పాఠశాలలో ఐదో తరగతి చదువుతున్న 12 ఏళ్ల జ్యోత్స్న అనే విద్యార్థిని సోమవారం రాత్రి 11 గంటలకు ఉపాధ్యాయులకు చెప్పకుండా గేటు తాళాలు తీసుకొని బయటికి వెళ్లింది. అటువైపుగా వెళ్తున్న కరాటే మాస్టర్ రాంబాబు చూసి పోలీసులకు సమాచారం అందజేశాడు. పోలీసులు వెతకడంతో విద్యార్థిని దొరికింది. దీంతో జిల్లా కేంద్రంలోని యాదవనగర్‌లో ఉన్న తల్లికి అప్పగించారు. దీనిపై ప్రిన్సిపాల్‌ను వివరణ కోరగా.. నూతనంగా అడ్మిషన్ పొందిన విద్యార్థిని తల్లిదండ్రులను చూడాలని బయటికి వెళ్లినట్లు తెలిపాడు.

గుడుంబా స్థావరాలపై దాడులు



కేసముద్రం: గుడుంబా స్థావరాలపై దాడులు చేస్తున్న పోలీసులు

కేసముద్రం: ఇనుగుర్తి మండలం తారాసింగ్‌తండా జీపీ శివారు బావోజీతండాలో గుడుంబా స్థావరాలపై మంగళవారం పోలీసులు దాడులు నిర్వహించారు. ఈమేరకు 10 లీటర్ల సారాను స్వాధీనం చేసుకుని, 100 లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేసి, ఒకరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై మురళీధర్‌రాజ్ తెలిపారు.

మహబూబాబాద్ రూరల్: మహబూబాబాద్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో గల గార్ల మండలం మర్రిగూడెం, గార్ల గ్రామాల్లోని గుడుంబా స్థావరాలపై దాడులు నిర్వహించామని ఎక్సైజ్ సీఐ జి.చిరంజీవి మంగళవారం తెలిపారు. గుడుంబా రవాణా చేస్తున్న జాటోత్ బీముడు, జాటోత్ భద్రాజీపై కేసు నమోదు చేసి వారి వద్ద నుంచి 8 లీటర్ల గుడుంబా స్వాధీనం చేసుకుని ఒక ద్విచక్ర వాహనాన్ని సీజ్ చేశామన్నారు. ఎక్సైజ్ ఎస్సై అశోక్, సిబ్బంది పాల్గొన్నారు.

ఇద్దరిపై కేసు నమోదు

గార్ల: మండలంలోని మర్రిగూడెం గ్రామంలో గుడుంబా స్థావరాలపై ఎక్సైజ్‌శాఖ పోలీసులు దాడులు నిర్వహించి గుడుంబా విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు మహబూబాబాద్ ఎక్సైజ్ సీఐ చిరంజీవి మంగళవారం తెలిపారు. మర్రిగూడెం గ్రామానికి చెందిన జాటోత్ భీముడు, జాటోత్ భద్రాజీ బైక్‌పై 8లీటర్ల గుడుంబా తీసుకెళ్తుండగా పోలీసులు పట్టుకొని పైఇద్దరిపై కేసు నమోదు చేసి, ద్విచక్రవాహనం సీజ్ చేసినట్లు సీఐ పేర్కొన్నారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ ఎస్సై అశోక్, సిబ్బంది పాల్గొన్నారు.

విధుల నుంచి వెంటనే తొలగించాలి



మాట్లాడుతున్న పీరయ్య

నెహ్రూసెంటర్: దివ్యాంగుల మనోభావాలు దెబ్బతీసేలా మాట్లాడిన ఐఏఎస్ అధికారి స్మితా సబర్వాల్‌ను వెంటనే విధుల నుంచి తొలగించాలని ఎంఎస్పీ జాతీయ నాయకుడు గుగ్గిళ్ల పీరయ్య మాదిగ, వీహెచ్‌పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అబ్బూరి వినోద్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వికలాంగులపై అవహేళనగా మాట్లాడడాన్ని నిరసిస్తూ జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ సెంటర్‌లో మంగళవారం నిరసన తెలిపారు. కార్యక్రమంలో వీహెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షులు చెలగోల వెంకన్న గౌడ్, జిల్లా అధికార ప్రతినిధి ఎండి.పాషా, నాయకులు సహదేవుడు, వెంకటేశ్వర్లు, వీరస్వామి, ఉప్పలయ్య, నారాయణ, చంద్రశేఖర్, నర్మద, సరోజ, కల్పన పాల్గొన్నారు.

కాలనీ పేరు మార్చాలి

డోర్నకల్: మున్సిపాలిటీ 8వ వార్డు పరిధిలోని మంగళిబజార్ పేరును నాయీబ్రాహ్మణ కాలనీగా మార్చాలని మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో ప్రతిపాదించాలని కోరుతూ.. వార్డు కౌన్సిలర్ శీలం భాగ్యలక్ష్మిశ్రీనివాస్‌కు నాయీ బ్రాహ్మణ సంఘం నాయకులు మంగళవారం వినతిపత్రం అందించారు.

నిత్యావసరాల పంపిణీ

డోర్నకల్: మండలంలోని గొల్లచర్ల గ్రామానికి చెందిన 80 ఏళ్ల సూరబోయిన రాములమ్మను ఎవరూ పట్టించుకోకపోవడంతో ఎస్పీ ఆదేశాల మేరకు సీఐ బి.ఉపేందర్‌రావు ఆధ్వర్యంలో మంగళవారం నిత్యావసర సరుకులను అందజేశారు. విద్యుత్ సిబ్బందితో మాట్లాడి రెండు రోజుల్లో వృద్ధురాలి ఇంట్లో విద్యుత్ కనెక్షన్ ఇప్పిస్తామని సీఐ ఉపేందర్‌రావు తెలిపారు. ఎస్సై సంతోష్‌రావు పాల్గొన్నారు.

రోడ్డుపై గుంతలను పూడ్చిన పోలీసులు



గూడూరు: రోడ్డు పరిశీలిస్తున్న పోలీసులు



గార్ల: మర్రిగూడెంలో..

గూడూరు: గూడూరు నుంచి కేసముద్రం వెళ్లే ప్రధాన బీటీ రహదారిలోని భారత్ పెట్రోల్‌పంపు ఎదురుగా బీటీ రోడ్డు గుంతలమయమై ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ విషయం తెల్సుకున్న ఎస్పీ గూడూరు సీఐ కె. బాబూరావు, ఎస్సై సీహెచ్. నగేష్‌లకు సమాచారం అందించారు. మంగళవారం వారు స్టోన్ క్రషర్ కాంక్రీటు ట్రాక్టర్‌లో తెప్పించి గుంతలను పూడ్చారు.

గార్ల: మండలంలోని మర్రిగూడెం గ్రామ సమీపంలో బీటీ రహదారిపై ప్రమాదకరంగా ఉన్న గుంతలను ఎస్సై ఎన్.జీనత్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు పూడ్చారు. ఎస్పీ ఆదేశాల మేరకు మండలంలో రహదారిపై గుంటల పూడ్చివేత కార్యక్రమం చేపట్టినట్లు ఎస్సై పేర్కొన్నారు. స్థానికులు పోలీసులను అభినందించారు. కార్యక్రమంలో కానిస్టేబుళ్లు శ్రీనివాస్, మంగీలాల్, శ్రీను, రాము పాల్గొన్నారు.

గిరిజన రైతులకు న్యాయం చేయాలి



కూల్చివేసిన ఇంటిని పరిశీలిస్తున్న నాయకులు

నెహ్రూసెంటర్: కొన్నేళ్లుగా వ్యవసాయం చేసుకుంటూ ఆ భూమిలోనే నివాసం ఉంటున్న గిరిజన రైతు భూములను ఆక్రమంగా లాక్కుంటున్నారని వెంటనే స్థానిక ప్రజాప్రతినిధులు, కలెక్టర్ స్పందించి గిరిజన రైతుకు న్యాయం చేయాలని సీపీఐ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బి.అజయ్‌సారథిరెడ్డి అన్నారు. బాబునాయక్‌తండా గిరిజన రైతు ఇంటిని కూల్చివేసి పంటను ధ్వంసం చేసిన ఘటనను సీపీఐ బృందం, ఎల్‌హెచ్‌పీఎస్ నాయకులు మంగళవారం పరిశీలించింది. అనంతరం వారు మాట్లాడారు. కార్యక్రమంలో బోడ లక్ష్మణ్ నాయక్, పెరుగు కుమార్, చింతకుంట్ల వెంకన్న, మంద శంకర్, అశోక్, హర్షవర్ధన్, చిలువేరు వికాస్, శ్రీనాథ్, లక్ష్మణ్‌పామర్ పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

నేటి నుంచి నల్లగొండకు బస్సు సౌకర్యం

తొర్రూరు: తొర్రూరు నుంచి నల్గొండకు నేటి నుంచి (బుధవారం) బస్సు సౌకర్యం కల్పిస్తున్నట్లు తొర్రూరు ఆర్టీసీ డీఎం పద్మావతి తెలిపారు. ఉదయం 6గంటలకు తొర్రూరులో మొదలై తిరుమలగిరి, మోత్కూరు, నార్కట్‌పల్లి మీదుగా నల్లగొండకు చేరుకుంటుందన్నారు.

నవోదయలో విద్యార్థికి సీటు



కేసముద్రం: కేసముద్రంవిలేజ్‌లోని శ్రీవివేకవర్ధిని హైస్కూల్‌కి చెందిన ఏశబోయిన శివ చైతన్య అనే విద్యార్థి మామునూరులోని జవహర్ నవోదయ నిర్వహించిన 9వ తరగతి ప్రవేశ పరీక్షలో సీటు సాధించినట్లు కరస్పాండెంట్ చిర్ర యాకాంతంగౌడ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఆర్థికసాయం

దంతాలపల్లి: మండలంలోని రామానుజాపురం గ్రామానికి చెందిన ధర్మారపు యాకయ్య ఇటీవలే అనారోగ్యంతో మృతిచెందాడు. దీంతో గ్రామ నాయకులు రూ.83,500 ఆర్థికసాయం బాధిత కుటుంబానికి మంగళవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఓలాద్రి రమేష్‌రెడ్డి, మల్లం శ్రీను, ఓలాద్రి వెంకటరెడ్డి, మల్లం భిక్షం, అక్కిరెడ్డి దామోదర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సబ్సిడీ విడుదల చేయాలి

గూడూరు: మండలంలోని ఏపూరు గ్రామనికి చెందిన నవతెలంగాణ విద్యార్థి పరిషత్ అధ్యక్షుడు బానోతు రామన్ననాయక్ మంగళవారం హైదరాబాద్‌లోని ట్రైకార్ చైర్మన్ బెల్లయ్యనాయక్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందించారు. అనంతరం ఎస్టీ కార్పొరేషన్ రుణాల సబ్సిడీపై విన్నవించారు. కార్యక్రమంలో మోహన్, బిక్కు, బన్సీలాల్ నాయక్ పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ అప్పగింత

మహబూబాబాద్ రూరల్: మహబూబాబాద్ మండలంలోని రెడ్యాల గ్రామానికి చెందిన ఒగ్గు మహేందర్ తన సెల్ ఫోన్ ఈనెల 4వ తేదీన అదే గ్రామంలో పోగొట్టుకోగా దానిని కనుగొని అతడికి అప్పగించామని రూరల్ ఎస్సై వి.దీపికరెడ్డి మంగళవారం తెలిపారు.

పేద విద్యార్థులకు చేయూత

తొర్రూరు రూరల్: మానుకోట సైబర్ క్రైమ్ డీఎస్పీ కొండ్లె శ్రీనివాస్, పద్మ దంపతులు మంగళవారం మండలంలోని పోలెపెల్లి గ్రామ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు టై, బెల్ట్, షూ అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం అనుమాండ్ల విమలాదేవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

శాస్త్రవేత్తల క్షేత్ర ప్రదర్శన

గార్ల: పత్తిపంట, మిర్చి నారుమళ్లలో కేవీకే మల్యాల శాస్త్రవేత్తలు క్రాంతికుమార్, రాంబాబు, కిషోర్ మంగళవారం క్షేత్ర ప్రదర్శన నిర్వహించి పంటల్లో చేపట్టాల్సిన సస్యరక్షణ చర్యలపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఓ రామారావు, ఏఈఓలు ప్రశాంత్, కిరణ్, మనోజ్, రాజశేఖర్ పాల్గొన్నారు.

నైపుణ్యాలను వెలికి తీయాలి

మహబూబాబాద్: పిల్లల్లో దాగి ఉన్న నైపుణ్యాలను వెలికి తీసేందుకు పలు కార్యక్రమాలు నిర్వహించి విద్యాబోధన చేస్తే సులువుగా అర్థమవుతుందని అంగన్‌వాడీ టీచర్ జి.సులోచన అన్నారు. జిల్లా కేంద్రం శివారులోని బీసీ కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం ఎల్లో డే కార్యక్రమం నిర్వహించారు.

ఎస్సీ, ఎస్టీలకు పదోన్నతులు కల్పించాలి

మహబూబాబాద్ అర్బన్: ఉపాధ్యాయ పదోన్నతుల విషయంలో ఎస్సీ, ఎస్టీ రోస్టర్ పాయింట్‌లో మిగిలిపోయిన ఖాళీలో తిరిగి ఎస్సీ ఎస్టీ ఉపాధ్యాయులచే భర్తీ చేయాలని సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చాగంటి ప్రభాకర్ మంగళవారం డీఈఓ పి.రామారావుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మాలోత్ రవీందర్ నాయక్, భద్రు నాయక్, తదితరులు పాల్గొన్నారు.

కార్యదర్శి వద్దని వినతి

దంతాలపల్లి: కార్యదర్శుల బదిలీలలో భాగంగా దంతాలపల్లి మండల కేంద్రానికి నూతన కార్యదర్శి ఈశబోయిన వెంకన్న మా గ్రామానికి వద్దని గ్రామ ప్రజలు ఎంపీడీఓ వివేక్‌రామ్‌కు మంగళవారం వినతిపత్రం అందజేశారు. అతడిపై అవినీతి ఆరోపణలు ఉండడంతో అధికారులు బదిలీ చేశారన్నారు. కార్యక్రమంలో యాకన్న, రవీందర్, సంపత్, బాలాజీ పాల్గొన్నారు.

వెదజల్లే పద్ధతితో రైతులకు మేలు

బయ్యారం: వెదజల్లే పద్ధతిలో వరి రైతులకు మేలు కలుగుతుందని మల్యాల వ్యవసాయ శాస్త్రవేత్తలు క్రాంతి, రాంబాబు, కిశోర్, మండల వ్యవసాయ అధికారి రాంజీ అన్నారు. మంగళవారం బయ్యారంలో వెదజల్లే పద్ధతిలో సాగు చేసిన వరి పంటను వారు పరిశీలించారు.

ఎస్పీని కలిసిన ఎస్సైలు

మహబూబాబాద్ రూరల్: జిల్లా ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్‌ను జిల్లా పోలీసు కార్యాలయంలో నెల్లికుదురు ఎస్సై రమేష్ బాబు, కేసముద్రం ఎస్సై మురళీధర్ రాజు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి మొక్క అందజేశారు.

దాతల సాయం అభినందనీయం



పెద్దవంగర: పేద విద్యార్థుల విద్యాభివృద్ధికి దాతలు చేస్తున్న సాయం అభినందనీయమని హెచ్‌ఎం లీలా శోభారాణి అన్నారు. మంగళవారం మండలంలోని బొమ్మకల్లు జెడ్పీ ఉన్నత పాఠశాల్లో చదువుతున్న ఐదుగురి విద్యార్థినులకు రోటరీ క్లబ్ ఆఫ్ వరంగల్ ప్రెసిడెంట్ కురుమెల్ల రాజగోపాల్, సెక్రటరీ గంట వేణుగోపాల్ ఆధ్వర్యంలో సైకిళ్లను పంపిణీ చేశారు.

ఉపాధ్యాయులకు వీడ్కోలు

మహబూబాబాద్ రూరల్: మహబూబాబాద్ మండలంలోని సింగారం ఎంపీ యూపీఎస్ పాఠశాల పనిచేసి బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులు బానోతు హరినాయక్, జి.వెంకటేశ్వర్లను పాఠశాలలో మంగళవారం ఘనంగా సన్మానించారు.

బీసీ డిక్లరేషన్ అమలు చేయాలి

గూడూరు: ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు బీసీ డిక్లరేషన్ వెంటనే అమలు చేయాలని బీసీ మండల నాయకుడు చారి డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం ఆయన మాట్లాడారు. అనంతరం తహసీల్దార్ శ్వేతకు వినతిపత్రం అందించారు.

పాఠశాలకు గ్రీన్ బోర్డుల బహూకరణ

పెద్దవంగర: వాసవీ క్లబ్ ట్రెజరర్ వల్లపు మధు జన్మదినం సందర్భంగా తన తండ్రి ఆగయ్య జ్ఞాపకార్థం రూ.8వేల విలువ చేసే రెండు గ్రీన్ బోర్డులను మంగళవారం మండలంలోని చిన్నవంగర ప్రాథమికోన్నత పాఠశాలకు బహూకరించారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్‌ఎం విజయ్‌కుమార్, హెచ్‌ఎం లక్ష్మయ్య అనిల్ పాల్గొన్నారు.

క్రైం కార్నర్..

పేకాట స్థావరాలపై పోలీసుల దాడులు



మహబూబాబాద్ రూరల్: మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో పేకాట స్థావరంపై పోలీసులు దాడి చేసి, 6గురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని, రెండు ద్విచక్ర వాహనాలు, ఐదు మొబైల్ ఫోన్లు, రూ.38 వేల నగదును స్వాధీనం చేసుకున్నారు. మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ పరారీలో ఉన్నారు. టౌన్ సీఐ పెండ్యాల దేవేందర్ మంగళవారం రాత్రి కేసు వివరాలను వెల్లడించారు. జిల్లా కేంద్రంలోని పెరిక కుల సంఘ భవనం సమీపంలో గల ఓ ఇంట్లో పేకాట ఆడుతున్నారని తెలుసుకున్న టౌన్ ఎస్సై బి.విజయ్‌కుమార్, పోలీసులు దాడి చేశారు. మహబూబాబాద్‌కు చెందిన తునగర్ ఈశ్వర్, మాలె లక్ష్మణ్, గుండ రాజశేఖర్, ఎర్ర నాగేశ్వర్‌రావు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లెందు మండలం ముకుందాపురం గ్రామానికి చెందిన బండారి శ్రీనివాస్, ఖమ్మం జిల్లా కేంద్రంలోని ముస్తాఫానగర్‌కు చెందిన ఓరుగంటి దనుంజయను అదుపులోకి తీసుకున్నారు. మహబూబాబాద్ మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ ఎండి.ఫరీద్ పరారీలో ఉన్నారు. వారందరిపై కేసు నమోదు చేశామని సీఐ తెలిపారు. ఈ దాడిలో హెడ్ కానిస్టేబుల్ మన్సూర్‌అలీ, కానిస్టేబుళ్లు సురేందర్, ఉపేందర్ పాల్గొన్నారు.

చిలుకోడులో..

డోర్నకల్: మండలంలోని చిలుకోడు గ్రామంలోని ఓ ఇంట్లో పేకాడుతున్న సురేష్, రవి, ప్రవేష్, పవన్, బుచ్చయ్య, వరదయ్యను అదుపులోకి తీసుకొని, మూడు ద్విచక్ర వాహనాలు, నాలుగు సెల్‌ఫోన్లు, నగదు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ ఉపేందర్‌రావు మంగళవారం తెలిపారు.

చికిత్స పొందుతున్న మహిళ మృతి

మరిపెడ రూరల్: పురుగుల మందు తాగి చికిత్స పొందుతూ మహిళ మృతి చెందిన సంఘటన మరిపెడ మండలం ఎల్లంపేట గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. ఎస్సై తాహెర బాబా కథనం ప్రకారం.. మండలంలోని ఎల్లంపేట గ్రామానికి చెందిన సట్టు రమ(45) ఇంట్లో ఆర్థిక పరిస్థితుల కారణంగా భార్యాభర్తల మధ్య గొడవలు జరుగుతున్నాయి. దీంతో తీవ్ర మనస్తాపంతో రమ ఈనెల 22న పురుగుల మందు తాగింది. వైద్యం కోసం వరంగల్ ఎంజీఎంకి తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందింది. మృతురాలికి భర్త వెంకన్న, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

తులం బంగారం, రూ.10వేల నగదు చోరీ

మహబూబాబాద్ రూరల్: జిల్లా కేంద్రంలోని రామచంద్రపురం కాలనీకి చెందిన బండారి అరుణ ఇంట్లో దొంగతనం జరిగి తులం బంగారు ఉంగరం, రూ.10వేల నగదు అపహరణకు గురయ్యాయి. అరుణ కుటుంబ సభ్యులు తమ వ్యక్తిగత పని మీద ఆదివారం హైదరాబాదుకు వెళ్లారు. మంగళవారం ఉదయం వారి ఇంటి తలుపులు తెరిచి ఉండటాన్ని పక్కింటి వారు గమనించారు. వెంటనే అరుణకు సమాచారం ఇచ్చారు. బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేయగా ఘటనా స్థలాన్ని టౌన్ ఎస్సై బి.విజయ్ కుమార్ పరిశీలించారు.

పారిశుద్ధ్య పనులకు నిధులు నిల్

నెల్లికుదురు: సీజనల్ వ్యాధులు రాకుండా నివారించేందుకు మీటింగులు పెట్టి ఉపన్యాసాలు ఇవ్వడం తప్ప అధికారులకు వేరే పని లేదని, పారిశుద్ధ్య పనులు నిర్వహించడానికి పంచాయతీ కార్యాలయాలల్లో నిధులు లేవని సీపీఐ మండల కార్యదర్శి బైన స్వామి అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు వెంకట్‌రెడ్డి, సత్యనారాయణ, వెంకటేశ్వర్లు, వెంకన్నగౌడ్, వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.

విశ్రాంత ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

మహబూబాబాద్: విశ్రాంత ఉద్యోగుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని ఆల్ పెన్షనర్స్, రిటైర్డ్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు నల్ల లింగయ్య డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ భవన్‌లో మంగళవారం సంఘం సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా లింగయ్య మాట్లాడుతూ.. పెండింగ్‌లో డీఏను విడుదల చేయాలన్నారు.